సుబ్బులు అలిగింది. సుబ్బులు అలగటం అంటే శ్రావణమాసంలో కోకిల కాకిలా అరవటమే. సుబ్బులు లాంటి దేవత కాకిలా అరిచినా సుబ్బారావుకి కోకిల పాడినట్లే ఉంటుంది. అయినా సుబ్బులు అలిగింది. కనుక ఆమె అలక తీర్చటం భర్తగా సుబ్బారావు తక్షణ కర్తవ్యం. అందుకే ఏం చేయాలా అని తీవ్రంగా మథనపడుతున్నాడు.



# సుబ్బులూ, సుబ్బారావూ

— రాజమోహన్

రింకల్లా తయారై షికారుకి బయలుదేరారు. సుబ్బారావు తన సహజమైన స్టయిల్లో మరెవ్వరికీ సాధ్యం కాని విధంగా విశాఖ నగరపు అందాలు వర్ణిస్తుంటే సుబ్బులు కళ్ళు ఆర్పకుండా అతన్ని ఆరాధనతోచూస్తూ వింటోంది. అలా ఎంత కాలం గడిచేదో కాని వాళ్ళిద్దరికీ ఎదురుగా తెల్లగా, పొట్టిగా నల్లటి వత్తైన జుట్టుతో కొలిచి వేసినట్టు అడుగులు వేస్తూ హిందీ నటుడు దిలీప్‌కు మల్లే ఉన్న ఒకాయన ఎదురుపడ్డాడు. ఆయనని చూడగానే సుబ్బారావు ముఖంలో మార్పు స్పష్టంగా కన్పించింది. అది రోడ్డు అని కూడా ఆలోచించకుండా ముందుకి దూసుకెళ్ళి ఆయన కాళ్లకి నమస్కరించేశాడు. అతన్ని వారిస్తూ ఆయన ఏదో అంటున్నాడు. అప్పుడు ఏదో గుర్తొచ్చినట్లు సుబ్బారావు వెనక్కి వచ్చి ఆయోమయంగా నిల్చున్న సుబ్బులుతో 'సుబ్బులూ నువ్వు రిక్షాలో వెళ్ళిపో నేను తర్వాత వస్తా' అని చెప్పేసి సుబ్బులు అనే ప్రాణి ఉన్న విషయం ఆ క్షణం నుంచే మరచిపోయినట్లు ఆయన దగ్గరికి వెళ్ళిపోయాడు.

సుబ్బులు నిశ్చేష్టురాలయింది. తనకేమీ తెలియని ఊళ్లో ఎక్కడో వదిలేసి 'నువ్వు రిక్షాలో వెళ్ళిపో నే తర్వాత వస్తా' అంటే ఆ క్షణంలో కలిగే భయాన్ని కూడా మించిన కోపమూ, ఉక్రోషమూ వచ్చాయి ఆమెకి. కానీ ఆ విషయం గమనించటానికి కూడా సుబ్బారావు లేడు. కనీసం 'నువ్వొక్కదానివీ వెళ్లగలవా?' అని అడిగిన పాపాన పోలేదు.

గుండెలు పీచుపీచు మంటుంటే పైకి ఎక్కడలేని గాంభీర్యమూ తెచ్చిపెట్టుకుని రిక్షాలో కూర్చుని 'ఫలానా ప్లేసుకిపదవోయ్' అంది. ఊరంతా నాకు కొట్టిన పిండేలే అన్నట్లు. రిక్షాలో ఉన్నంతసేపూ ఉగ్గపట్టుకుని కూర్చున్నది. ఇల్లు చేరాక రిక్షావాడికి డబ్బులిచ్చి గదిలోకి వస్తూనే దుఃఖం ఆపుకోలేక భోరుమంది. తనని ఒక్కదాన్నీ ఎక్కడో వదిలేసి సుబ్బారావు వెళ్ళిపోవటం తలుచుకున్న కొద్దీ దుఃఖం పెరిగిపోయింది. ఏడుస్తూనే నిద్రపోయింది. ఆమె మళ్ళీ నిద్రలేచేసరికి రాత్రి పదయ్యింది. సుబ్బారావు ఇంకా రానేలేదు. అన్నం కూడా వండుకోకుండా అలాగే విచారంగా కూర్చుంది. రాత్రి పదిన్నరకి సుబ్బారావు నెమ్మదిగా ఇల్లు చేరాడు. అతను ఇంటిగేటు తెరుస్తుంటే కోపంగా తలగడాలో ముఖం దాచుకుని పడుకుందామె. తలుపులు తెరిచే ఉన్నాయి.

లోపలికి వచ్చిన సుబ్బారావు 'భోం చేశావా సుబ్బులూ'? అని అడిగాడు.

సుబ్బులు జవాబివ్వలేదు.

'నేను తినేశాలే. అందుకని అడుగుతున్నాను'

'పెళ్ళాన్ని రోడ్డు మీద వదిలేసి వచ్చారు. భోజనం చేసిందో లేదో మాత్రం కావాలీయనకి' అనుకుంది సుబ్బులు కోపంగా.

'ఇందాక కలిసాయనెవరో తెలుసా? ఆయనే జ్యేష్ఠగారంటే. గొప్ప రచయిత. 'నాక్కొంచెం నమ్మకమివ్వు.' అని అద్భుతమైన నవల వ్రాసింది ఆయనే అన్నాడు సుబ్బారావు.

'చాలా కాలం తర్వాత ఆయనతో కొన్ని గంటలు గడిపే అదృష్టం కలిగింది నాకు. ఎన్ని తెలుసో ఆయనకి. ఆయనతో మాట్లాడుతుంటే టైమే తెలియదు. చివరికి ఆయన బలవంతం చేస్తే అక్కడే భోజనం చేసి వచ్చాను.

ఇందాక సుబ్బారావుని కలిసినాయనే జ్యేష్ఠగారనీ, సుబ్బారావు కేవలం తోటి రచయితతో బాతాఖానీకి వెళ్ళాడు తప్ప, మందుకొట్టడానికి కాదు అని తెలిశాక అంతవరకూ ఉన్న ఏవేవో భయాలన్నీ తొలగిపోయాయి. కానీ తనని ఒక్కదాన్నీ వదిలేసి వెళ్ళిపోయినందుకు వచ్చిన కోపం మాత్రం పోలేదు సుబ్బులుకి, అందుకే బుంగమూతితో లేచి హాల్లోకి వెళ్ళిపోయి సోఫామీద కూర్చుంది.



"ఆయన తాగొచ్చినప్పుడల్లా నీమీద చెయ్యి చేసుకుంటారా వదినా?" అడిగింది పార్వతి.

"నా బొంద... ఆయనగారు తాగొస్తే చెయ్యేదో కాలేదో గుర్తుండి చస్తే గదమ్మా" చెప్పింది రాంబాయి.

పద్మశ్రీ [మాణిక్యారం]


సుబ్బులు తనతో మాట్లాడటం లేదని అప్పుడు గ్రహించాడు సుబ్బారావు. కొంచెం ఆలోచించేసరికి తను ఎంత ఫూలిష్‌గా బిహేవ్ చేసాడో అర్థమయిందతనికి. తన అభిమాన రచయిత కనపడగానే ఆనందంతో అంతా మరిచిపోయి భార్యని అందునా ఊరు పూర్తిగా తెలియని పల్లెటూరమ్మాయిని క్లిష్టమైన పరిస్థితిలో వదిలేసినందుకు తనని తను నిందించుకున్నాడు. 'ఇంటికి ఎలా వచ్చిందో పాపం' అనుకుంటూ హాల్లోకి వచ్చాడు.

సుబ్బులు పక్కనే కూర్చుని 'అయామ్ సారీ సుబ్బులూ' అన్నాడు.

కోపంగా తలతిప్పేసుకుంది సుబ్బులు. ఆమె పొడవాటి జడ విసురుగా కదిలి ముఖం మీద ఛెళ్ళున కొట్టినట్లయింది. పరిస్థితి ఏమీ బావులేదనుకున్నాడు సుబ్బారావు. ఇటువంటి స్థితిలో నోరెత్తకుండా కూర్చోవటమే శ్రేయస్కరమని నిశ్చయించుకుని ఆమె ముందు ఆమె మనస్సు కరిగిపోయేలా దీనంగా ముఖం పెట్టుకుని కూర్చున్నాడు. సెకన్లు నిముషాలయ్యాయి. నిముషాలు గంటలు కూడా అవుతున్నాయి. కానీ సుబ్బులు దయ తలచటం లేదు.

'జ్యేష్ఠగారు ముంచేసారే. ఇలాంటి పరిస్థితి వస్తే ఆయన ఏం చేసునో' అనుకున్నాడు.

అంతలోనే ఏమనిపించిందో లేచి మళ్ళీ బట్టలు వేసుకున్నాడు. కోపంగా ఉంటూనే సుబ్బులు అంతా గమనిస్తోంది ఓరచూపుల్తో. అతను సైకిల్ తీస్తున్న శబ్దం వినిపించి ఓ క్షణం కంగారు పడింది గానీ లోకువైపోతానేమోనని బైటికి రాకుండా బింకంగా కూర్చుండిపోయింది. వెళ్ళి అరగంటయినా సుబ్బారావు రాలేదు. టైము గడుస్తున్న కొద్దీ కోపంలోనే మళ్లీ అతను ఏమయ్యాడోనని భయం పెరుగుతుంటే కిటికీ దగ్గర రోడ్డువైపే చూస్తూ కూర్చుందామె. అతను రావటం లేదు. ఆమెలో అలజడి పెరిగిపోతోంది. 'ఇక పక్కింటాయనతో చెప్పి వెతికించాలా?' అనుకుంటూ ఉంటే దూరంగా సుబ్బారావు సైకిల్ కనిపించింది.



"నేనిక్కడ పని సేయలేనండమ్మగారూ"

"ఏం ఎందుకే లచ్చీ అయ్యగారు ఏమైనా అన్నారా?"

"ఏమీ అనట్లేదనేనమ్మా"

పద్మశ్రీ [మాణిక్యారం]

వెంటనే తన అలకని మళ్ళీ గుర్తు చేసుకుని చివ్వున లేచింది కిటికీ దగ్గర నుంచి. గబగబా లోపలికి వచ్చేసి సోఫా మీద అదే సత్యభామ భంగిమలో కూర్చుంది. కాసేపయ్యాక సుబ్బారావు లోపలకు వచ్చిన శబ్దం వినిపించింది. ఆమె తలెత్తలేదు. సుబ్బారావు ఆమె దగ్గర ఆగకుండా బెడ్‌రూం లోనికి వెళ్లిపోయాడు.

'హు' ఎంత అహంకారం అతనికి నే లెక్క లేకపోతే నేనూ లొంగేది లేదు' అనుకుంది సుబ్బులు.

కాసేపయ్యాక సుబ్బారావు హాల్లోకి వచ్చి టీపాయ్ మీద ఏదో పెడుతున్న చప్పుడు వినిపించింది. అతను ఏం చేస్తున్నాడో చూడాలనిపించినా చూడకుండా సోఫా మీద మోచేతులు ఆన్చి ముఖం దాచుకుని కూర్చుంది. తర్వాత ఏవో మీట నొక్కినట్లు వినిపించింది. అది ఏమై ఉంటుందో ఊహించుకునే లోపు గట్టిగా పాట మొదలయింది. సుబ్బులుకి ఎంతో ఇష్టమయిన కిషోర్‌పాట అది. 'నాకు ఈ పాట ఇష్టమని ఈయనకెలా తెలును?' అనుకుంటూ తలెత్తి చూసింది. టీపాయ్ మీద పడున్న కవర్లోంచి కిషోర్‌కుమార్ క్యాసెట్లు తొంగిచూస్తున్నాయి. అప్పుడు సుబ్బారావు వైపు చూసింది.

ఆముదం తాగితేనే సినిమాకి తీసుకుపోతానంటే నిస్సహాయంగా తల్లిదండ్రుల నిరంకుశత్వం నిరసిస్తూ ఆముదం తాగుతున్న కుర్రాడిలా మూతి ముడుచుకుని పాట వింటున్నాడు సుబ్బారావు. అతని ముఖం చూడగానే గలగలమని నవ్వేసింది సుబ్బులు. అంతకుముందు లేని చనువుతో అతని బుగ్గ పట్టుకుని గట్టిగా ఆడించి ముద్దు పెట్టుకుని 'నాకోసం ఎంతత్యాగం చేసారు?' అంది.

'మరేం చేయను? ఇంకో దారి కనపడడంలేదు. అప్పటికీ నేను బతిమాలితే షాపు ఓనరు అర్థరాత్రయినా షాపు తెరిచి కాసెట్లు ఇచ్చాడు కనుక ఇదయినా సాధ్యమయింది' ఇంకా మూతి ముడుచుకునే చెప్పాడతను.

'మిమ్మల్ని ఇక బాధ పెట్టను లెండి' అంటూ సుబ్బులు టేప్‌రికార్డర్ ఆపేస్తుంటే 'వద్దు. వద్దు. ఈరోజు నుండి కిషోర్ నాకు కూడా ఇష్టమే' అని నవ్వేసాడు సుబ్బారావు.

అలక తేలిపోయిన సుబ్బులు చిన్నపిల్లలా సుబ్బారావు చెయ్యి గట్టిగా పట్టుకుని నిద్రపోతూ ఉంటే సుబ్బారావు మాత్రం తన పెళ్లాం అలక తీర్చిన కిషోర్‌కుమార్‌కి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ వాక్‌మెన్‌లో కిశోర్ పాటలు వింటున్నాడు.

సుబ్బులు అలకకి తన అభిమాన రచయిత కారణమైతే ఆ అలక తీరటానికి సుబ్బులు అభిమాన గాయకుడు కారణం. తమ మధ్య రాగద్వేషాల్లో కూడా పాలు పంచుకుంటూ ఎందరి జీవితాలలోనో ముఖ్యమైన మనుషుల్లా ఉండిపోయే 'ఈ మహానుభావుల జన్మ ధన్యం కదా!' అనుకున్నాడు సుబ్బారావు.